క్లుప్తంగా

నేడు గ్రహణమొర్రి స్క్రీనింగ్ క్యాంప్

దుమ్ముగూడెం: సమగ్రశిక్ష తెలంగాణ, బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించే స్క్రీనింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌క్లూసివ్ రిసోర్స్ పర్సన్స్ సతీష్, రాగిణి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కొత్తగూడెంలోని రైటర్ బస్తీ వద్ద ఉన్న భవిత కేంద్రంలో ఈ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో 6 నెలల నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉన్న వారు పాల్గొని పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు. వివరాల కోసం 9963280621, 7981104457 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గ శాసన సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌ను ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావ్ మాట్లాడుతూ.. పెన్షనర్స్ అసోసియేషన్ సొంత కార్యాలయ నిర్మాణానికి స్థల సేకరణ చేసి ప్రభుత్వ నిధులతో నిర్మించే విధంగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బంధు వెంకటేశ్వర్లు, చల్లగుళ్ల నాగేశ్వరరావు, రాజబాబు, కృష్ణమూర్తి, సత్యనారాయణ, మంగయ్య, ప్రసాద్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు ఇవ్వాలి

చర్ల: అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎన్డీ సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ మాట్లాడారు. చిరిగిడి నరేష్, కనితి భాను ప్రకాశ్, ఇర్పా సమ్మక్క, లక్ష్మి, అక్కులదేవి, వెంకటేశ్వర్లు, స్వరూప, మనోజ్, గంగుల వెంకటి, జయమ్మ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

చర్లరూరల్: పాతచర్ల బాలికల హైస్కూల్‌లో చదువుతూ.. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థినులకు సోమవారం సుమారు రూ.25 వేల విలువ చేసే క్రీడా దుస్తులు, షూస్‌లను సువిధ వికాస్ ట్రస్టు అప్తగుర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వితరణ అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కన్వీనర్ మన్మథరావు మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పరుచూరి రవి కుమార్, ప్రధానోపాధ్యాయురాలు టి.బేసమ్మ, పీఈటీ హేమ, ఉపాధ్యాయులు రమాదేవి, రాజేశ్వరి, రజిని, ఇంద్రమ్మ, అమ్మాజి, జెడ్పీటీసీ పాశికంటి జ్యోతి పాల్గొన్నారు.

సీపీఐ వితరణ

చర్ల: కలివేరు గ్రామపంచాయతీలోని బట్టీగూడెంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూరిళ్లు దగ్ధమై నష్టపోయిన బాధిత జోగయ్య కుటుంబానికి సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు, జిల్లా సమితి సభ్యుడు అడ్డగర్ల తాతాజీ, మాజీ సర్పంచ్ మల్లం నాగేశ్వరావు నాయకులు సీతయ్య, నర్సింహారావు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండలంలోని లంక మల్లారంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలికల వసతి గృహంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ విద్యార్థినులకు పరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవి, సుమ, వినయ్ బాబు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందం అమలు చేయాలి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో వివిధ ఓపెన్ కాస్ట్ గనుల్లో పని చేస్తున్న ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ ఒప్పందాన్ని అమలు చేయించాలని కోరుతూ మణుగూరు ఏరియా ఆపరేటర్లు సోమవారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకుడు, వేజ్ బోర్డ్ సభ్యుడు రియాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆపరేటర్లు నాసర్‌పాషా, గట్టయ్య, కుమారస్వామి, ఈశ్వర్, జానకిప్రసాద్, అహ్మద్, సుదర్శన్, సురేష్ పాల్గొన్నారు.

ప'రేషన్'కు మోక్షమెప్పుడు?

- కొత్త రేషన్ కార్డుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న అర్హులైన ప్రజలు
- కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు



చౌక దుకాణంలో రేషన్ తీసుకుంటున్న ప్రజలు (ఫైల్)

చర్ల: ఏళ్ల తరబడిగా రేషన్ కార్డుల్లో నూతన పేర్లు చేర్చకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం పాత రేషన్ కార్డుల్లో కొత్త పేర్లను చేర్చడం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఏళ్ల తరబడిగా నిరీక్షిస్తున్నప్పటికీ ఫలితం లేకపోయింది. 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని, ఉన్న రేషన్ కార్డుల్లో కొత్త వారిని చేరుస్తామని ప్రకటించడంతో రాష్ట్రంలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు చేసుకున్నారు. ఈ క్రమంలో వీటిని తహసీల్దార్లు పరిశీలన చేసి జిల్లా పౌర సరఫరా అధికారికి పంపించారు. కాని అప్పటి నుంచి వాటి ఊసే లేకుండా పోయింది. దీంతో కొత్త రేషన్ కార్డుల కోసం ఏళ్ల తరబడిగా జనం ఎదురు చూస్తూనే ఉన్నారు.

అందని సంక్షేమ ఫలాలు..

రేషన్ కార్డులు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న దాదాపు ప్రతీ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ, వంటగ్యాస్, డబుల్ బెడ్రూం ఇళ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు ఇలా ప్రతీ పథకాల అమలుకు రేషన్ కార్డును లింక్ చేస్తున్నారు. రేషన్ కార్డుల లేని వారిని అనర్హులుగా దరఖాస్తులను స్వీకరించడం లేదు. ఈ నేపథ్యంలో అర్హత ఉండి కూడా రేషన్ కార్డు లేని లబ్ధిదారులు ఆయా పథకాలకు దూరమవుతున్నారు. మరోవైపు పెళ్లిళ్లు అయి అత్తవారి ఇళ్లకు వెళ్లిన ఆడ పిల్లల పేర్లను మాత్రం తమ తల్లిదండ్రుల కార్డు నుంచి తక్షణమే అధికారులు తొలగిస్తూ వచ్చారు. కానీ అత్తవారి ఇంటి వద్ద రేషన్ కార్డుల్లో మాత్రం ఇంటి కోడళ్ల పేర్లను చేర్చలేదు. దీంతో సమస్య తీవ్రతరం అయింది.

ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా?

రేషన్ కార్డుల జారీ, మార్పుల వ్యవహారం గత ప్రభుత్వం చేతుల్లో ఇన్నాళ్లు నలగగా.. ప్రస్తుతం వచ్చిన నూతన ప్రభుత్వం వైపు లబ్ధిదారులు చూస్తున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో అయినా త్వరిత గతిన రేషన్‌కార్డులు జారీ అవుతాయా? సంక్షేమ పథకాలను చేరువ చేస్తారా? అని ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

గృహలక్ష్మికి దరఖాస్తు సాధ్యపడలేదు..



నాకు పెళ్లయ్యి ఆరు సంవత్సరాలు అవుతోంది. భార్యా ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొత్త రేషన్‌కార్డు కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా రాలేదు. రేషన్‌కార్డు లేకపోవడంతో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోయాను. ఈ ప్రభుత్వమైనా ఇస్తే ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటా.

– మేడి రాజేష్, కుదునూరు

రేషన్ రావడం లేదు..



నాకు పెళ్లయ్యి ఐదేళ్లు అవుతోంది. గతంలో మా తల్లిదండ్రులతో ఉన్న రేషన్ కార్డులో నా పేరు ఉంది. పెళ్లయ్యి ఐదేళ్ల అవుతున్నప్పటికీ కొత్త రేషన్ కార్డు రాలేదు. దీంతో ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులు ఏమీ మాకు అందడం లేదు.

– మామిడి శ్రీకాంత్, తేగడ

ఆరోగ్యశ్రీ వర్తించడం లేదు..



నాకు పెళ్లయ్యి ఆరేళ్లు కావస్తోంది. రేషన్ కార్డులో నా భార్య కుమార్తె పేరు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ పథకం వర్తించడం లేదు. మా కుటుంబంలో ఇద్దరి పేర్లు చేర్పించేందుకు ఆన్‌లైన్‌లో రెండేళ్ల క్రితం దరఖాస్తు చేశాను. ఇంత వరకు అధికారులు పేర్లు చేర్చలేదు.

– సినిగిరి సత్యనారాయణ, ఆర్ కొత్తగూడెం

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరులో సోమవారం ఎట్టకేలకు ట్యాంకర్‌తో తాగునీరు అందించారు. కొద్ది రోజులుగా గ్రామంలో నెలకొని ఉన్న తాగునీటి సమస్యపై 'సాక్షి' దినపత్రికలో 'కొత్తూరులో తాగునీటికి కటకట' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై గ్రామ పంచాయతీ సర్పంచ్ కొడిమి సీత, కార్యదర్శి బాబు స్పందించి ప్రత్యేకంగా ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీరు సరఫరా చేశారు. కాగా మరమ్మతులకు గురైన బోరుకు తక్షణమే మోటారు బిగించి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



జీఎం జగ్గారావును సన్మానిస్తున్న సహకార సంఘం పాలకవర్గం

అశ్వాపురం: సహకార సంఘాల సేవలు, చట్టాలపై సంఘ సభ్యులు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భారజల కర్మాగారం జీఎం జగ్గారావు అన్నారు. హెచ్‌డబ్ల్యూపీఎం ఆఫీసర్లు, టెక్నికల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలోని తరంగిణి ఫంక్షన్ హాల్‌లో సోమవారం సహకార సంఘం సభ్యులకు ఒక్క రోజు అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమాన్ని జీఎం జగ్గారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. సహకార సంఘం సేవలను సభ్యులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీనియర్ అధికారి రాజయ్య సభ్యులకు సహకార సంఘాల సేవలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జి.వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు జె.రాంచందర్‌రావు, కార్యదర్శి డీవై.స్వామి, కోశాధికారి ఎస్.రాజయ్య, డైరెక్టర్లు వీఎస్ఆర్‌కే.ప్రసాద్, ఈపీ.రెడ్డి, ఎంవీ.నాగభూషణం, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బూర్గంపాడు: మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన కంటి కుమార్‌కు సోమవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తల్లిదండ్రులు లేని కుమార్ ఆరోగ్యం క్షీణించగా.. వైద్య ఖర్చుల నిమిత్తం చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, ట్రస్ట్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

నేస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుమార్‌కు సోమవారం రూ.6 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి, వైస్ చైర్మన్ చితం అంకిరెడ్డి, కార్యదర్శి ఇండ్ల వెంకటరాజేష్, ఆవుల శివ నాగిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ బత్తుల రామకొండారెడ్డి, పేరం రామిరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

మణుగూరురూరల్: పక్షవాతంతో బాధపడుతున్న కూనవరం గ్రామానికి చెందిన నవ్యశ్రీకి లయన్స్ క్లబ్ డైరెక్టర్, మల్టీపుల్ చైర్మన్ బాబురావు, జిల్లా 320ఈ మాజీ గవర్నర్ తీగల మోహన్‌రావుల సూచన మేరకు సోమవారం స్థానిక క్లబ్ సభ్యులు రూ.1800 విలువ చేసే నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్‌రావు, కార్యదర్శి మీరాహుస్సేన్, కోశాధికారి అడబాల నాగేశ్వరరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మానిటరింగ్ సెక్టోరియల్ అధికారి నాగరాజశేఖర్

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెం, నాచారం, మల్కారం గ్రామాల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల ఉన్నతి, లక్ష్యాలపై ఉపాధ్యాయులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ మానిటరింగ్ సెక్టోరియల్ అధికారి నాగరాజశేఖర్ హాజరవగా.. దమ్మపేట, అశ్వారావుపేట, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులకు బోధనలో ఉన్నతి, లక్ష్యాలపై సెక్టోరియల్ అధికారి పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం మండలంలోని సరోజినీపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సెక్టోరియల్ అధికారి సందర్శించారు. పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ తరహాలో బోధన జరుగుతుందా లేదా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభను పరిశీలించి, బోధన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిణి కీసర లక్ష్మి, నోడల్ అధికారి జగపతి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంతెన పనులు పునఃప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



పునఃప్రారంభమైన ఇసుకవాగు వంతెన పనులు

అశ్వాపురం: మండలంలోని గొందిగూడెంలో ఇసుకవాగుపై వంతెన పనులు సోమవారం పునఃప్రారంభించారు. గత జూలై నెల నుంచి వంతెన పనులు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8న 'నిలిచిన వంతెన పనులు' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి వంతెన పనులు పునఃప్రారంభానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి వర్షాకాలం లోపు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

మెరుగైన పాలనే ధ్యేయం

దమ్మపేట: అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంగా మెరుగైన పాలనే ధ్యేయంగా పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధికారులకు సూచించారు.

సోమవారం మండల పరిధిలోని గండుగులపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో విద్యుత్‌శాఖ అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అశ్వారావుపేట నియోజవర్గ ఎమ్మెల్యేగా అధికారులతో సమన్వయంగా పనిచేస్తానన్నారు. అధికారులు కూడా ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. ప్రజల కోసం పనిచేసే అధికారులకు తాను ఎల్లప్పుడు అండగా ఉండి, ప్రోత్సాహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, విద్యుత్ శాఖ డీఈ నందయ్య, ఏడీఈ వెంకటేశ్వర్లు, ఏఈలు మహేష్, సాయికిరణ్, సంతోష్, శరత్, నరసింహారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం స్వామి వారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా జరిపించారు. ఆలయాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం జరిపించారు. చివరి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలను వెలిగించారు. స్వామి వారి పూజా కార్యక్రమాల్లో ఆలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు, బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ, ఉపేందర్‌రెడ్డి, చిల్లపల్లి వెంకటేశ్వరరావు, చల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట రిలే దీక్షలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఎదుట గోడ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జీఓ నం.45ని అమలు చేయాలని కోరుతూ సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ దీక్షలను గోడ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడారు. భద్రాచలం పట్టణాన్ని మూడు పంచాయతీలుగా విభజించి ఎన్నికలు నిర్వహించే విధంగా ఇచ్చిన జీఓ నం.45ను అమలు చేసి వచ్చే ఎన్నికల్లో మూడు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన అన్నారు. అలాగే భద్రాచలం నుంచి తునికి చెరువు మీదుగా చెరుపల్లి, మారాయిగూడెం, ఆర్లగూడెం నుంచి లక్ష్మీనగరం వరకు ఆర్టీసీ బస్సులను నడపాలని అన్నారు. దీంతో తెలంగాణ నూతన ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఆయా గ్రామాలకు అందుతుందన్నారు. కార్యక్రమంలో వాసం రామకృష్ణ దొర, రమేష్, రాజు, శ్రీరామ్మూర్తి, చిట్టిబాబు, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి



గుండాల: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

గుండాల: ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వ సర్వే నిర్వహించి నష్టపరిహారం చెల్లించాలని ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు భట్టు ప్రసాద్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో న్యూడెమొక్రసీ అనుబంధ ఏఐకేఎమ్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో అకాల వర్షంతో తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయాధికారులతో సర్వేలు నిర్వహించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు అరెం నరేష్, గడ్డం లాలయ్య, జర్పుల కిషన్, పాయం ఎల్లన్న, ఈసం కృష్ణ, బత్తిని సత్యం, అజ్జర్, తాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని, కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్డీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గొని నాగేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు జక్కుల రాంబాబు, నాయకులు వైఎస్.రెడ్డి, వీరమల్ల ఉమ, ముత్యాల సత్యనారాయణ, సామ వినోద, లక్ష్మణ్,వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులందరినీ ఆదుకుంటాం..



చర్ల: దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య



అశ్వారావుపేటరూరల్: దెబ్బతిన్న వేరుశెనగ పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

చర్ల: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. తుపాను ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి, మిర్చి, పత్తి పంటలను సోమవారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టంపై ప్రభుత్వం అధికారుల నుంచి నివేదిక కోరిందని, నష్టం అంచనాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని నమోదు చేస్తారని ఆయన అన్నారు. రైతులు అధైర్య పడకుండా దెబ్బతిన్న పంటలను మినహాయించి మిగిలిన పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయశాఖాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఆయన కోరారు. పొదెం వీరయ్య వెంట టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాదరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, డీసీఎంఎస్ డైరెక్టర్ పరుచూరి రవికుమార్, ఎంపీటీసీ సభ్యురాలు మడకం పద్మజ, సర్పంచ్‌లు ఎలకం నరేంద్ర, సరియం రాధ, పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఉన్నారు.

రైతులు అధైర్యపడొద్దు..

అశ్వారావుపేటరూరల్: మిచాంగ్ తుపానుతో నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని అశ్వారావుపేట నియోజకవర్గ శాసన సభ్యుడు జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, దబ్బతోగు, మల్లాయిగూడెం, పండువారిగూడెంతోపాటు పలు గ్రామాల్లో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తుపాను కారణంగా దెబ్బతిన్న గృహాలు, ధాన్యం రాశులను, నేల వాలిపోయిన వరి పంట, వేరుశెనగ పొలాలను సందర్శించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన వివరాలను ఇప్పటికే వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారని, నివేదిక రాగానే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకునేలా కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా ఊట్లపల్లి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బిర్రం రమాదేవి, సొసైటీ చైర్మన్లు సీహెచ్ సత్యనారాయణ, నిర్మల పుల్లారావు, నాయకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీని గెలిపించాలి

మణుగూరుటౌన్: కార్మికుల సమస్యలు పట్టించుకోని టీబీజీకేఎస్‌ను ఓడించి ఏఐటీయూసీని గెలిపించాలని ఆ సంఘం బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ కోరారు. సోమవారం మణుగూరు ఓసీ–4లో ఫిట్ మీటింగ్ జరగ్గా.. ఆయన హాజరై మాట్లాడారు. టీబీజీకేఎస్ నాయకులు కార్మికులకు న్యాయంగా రావాల్సిన అనేక హక్కులను మెనేజ్‌మెంట్ దగ్గర కుదువబెట్టి తమ పబ్బం గడపుకున్నారన్నారు. కోల్ గ్రేడ్ పేరు చెప్పి ఇన్సెంటివ్ విధానాన్ని నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.29వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, సింగరేణి సంస్థ ప్రతి నెలా కార్మికుల జీతాల కోసం బ్యాంకుల వద్ద అప్పులకు తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. 100 బావులు తీసి లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మాయమాటలతో అధికారంలోకి వచ్చి సంస్థను నాశనం చేశారన్నారు. ఈ నెల 15న పీవీకాలనీలో జరిగే జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 27న జరిగే ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామనర్సయ్య, నాయకులు పుల్లారావు, ఆవుల నాగరాజు, నంబూరు శ్రీనివాసరావు, ఆదర్ల సురేందర్, సుభానీ, కోడిరెక్కల శ్రీనివాసరావు, బండారి రవి, కందిమల్ల శ్రీనివాస్, పాపారావు, గణపతి, భీమ్‌సింగ్ తదితరులు ఉన్నారు.